
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.8 ; కనిష్ఠం 24.7



ఆదిలాబాద్

జిల్లా వార్తలు

గురువారం 18 జూలై 2024



గోడలపై విప్ నోటీసులు అంటిస్తున్న పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్

అవిశ్వాసం నేపథ్యంలో కాంగ్రెస్ విప్ జారీ

- కౌన్సిలర్ల ఇంటి గోడలపై అతికించిన నోటీసులు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 17: ఈ నెల18న మున్సిపల్ కార్యాలయంలో జరిగే అవిశ్వాస తీర్మానానికి సభ్యులు తప్పకుండా హాజరై మద్దతు తెలపాల ని రాజకీయ పార్టీలు తమ కౌన్సిల్ సభ్యులకు విప్‌లు జారీ చేశాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి సంబంధించి పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్‌కు ఈ విప్ అధికారం బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించిన కౌన్సిలర్లు బడాల సుజాత, అంబకంటి అశోక్, దర్శనాల లక్ష్మణ్, రేష్మ, విజయ్ నివాసాలకు ఈ విప్ నోటీసులు అందించేందుకు వెళ్లారు. కాగా వారు అందుబాటులో లేకపోవడంతో వారి ఇంటి గోడలకు వాటిని అతికించారు.



అవిశ్వాసానికి.. అంతా సిద్ధం

- నేడు మున్సిపల్ వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రధాన పార్టీలు
- కీలకం కానున్న ఎంఐఎం, కాంగ్రెస్ అసమ్మతి కౌన్సిలర్ల మద్దతు
- బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ల మద్దతుపై అనుమానాలు
- మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు

ఆదిలాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్‌రంజానిపై అవిశ్వాస తీర్మానానికి అంతా సిద్ధమైంది. గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ పాలకవర్గ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు. ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్ అధ్యక్షతన అవిశ్వాస తీర్మానంపై బలపరీక్షను నిర్వహిస్తారు. ఉదయం 11గంటల నుంచి 11.30 నిమిషాల వరకు 2/3 వంతు సభ్యుల కోరం ఉంటే సమావేశాన్ని కొనసాగిస్తారు. మున్సిపాలిటీలో మొత్తం సభ్యుల సంఖ్య 49 కాగా, 33 మంది కౌన్సిలర్లు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాల్సి ఉంటుంది. దీంతో చేతులెత్తే పద్ధతిలో మెజార్టీని బట్టి అవిశ్వాసం నెగ్గడం లేదా వీగిపోవడం అనేది తేలిపోనుంది. ఇప్పటికే క్యాంపుబాట పట్టిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన కౌన్సిలర్లు నేరుగా మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ప్రత్యేక సమావేశానికి హాజరుకానున్నారు. అన్ని పార్టీల అగ్రనేతలు రంగంలోకి దిగి వ్యూహరచన చేస్తున్నారు. మున్సిపల్ అవిశ్వాసం ప్రధాన పార్టీలకు పెద్దసవాలుగా మారింది. అవిశ్వాసం నెగ్గేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నాలు చేస్తుండగా.. ఎలాగైనా అవిశ్వాసం వీగిపోయే విధంగా అధికార పార్టీ అడుగులు వేస్తోంది. అయితే బల్దియాలో ప్రస్తుతం ఎవరి బలం ఎంతా అనే చర్చ జోరుగా సాగుతోంది. అవిశ్వాస తీర్మానాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

పట్టుబిగిస్తున్న పార్టీలు

మున్సిపల్ వైస్ చైర్మన్ పదవీ కాలం పెద్దగా లేకపోయినా.. ప్రధాన పార్టీలన్నీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. అవిశ్వాసంతో తమ పంతాన్ని నెగ్గించుకునేందుకు ప్రధాన పార్టీలన్నీ పట్టుబిగిస్తున్నాయి. అవిశ్వాసం ఎపిసోడ్‌తో తీవ్రంగా నష్టపోయిన బీఆర్ఎస్ వైస్ చైర్మన్‌ను గద్దె దించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. అదేవిధంగా అధికార పార్టీకి దీటుగా ఎత్తుగడలు వేస్తూ.. బీజేపీ తన సత్తాను చాటేందుకు సిద్ధమైంది. ప్రతిపక్షాల ఎత్తులను చిత్తుచేస్తూ ఎలాగైనా అవిశ్వాసం వీగిపోయే విధంగా అధికార కాంగ్రెస్ పార్టీ పక్కాప్లాన్‌తో ముందుకెళ్తోంది. ప్రస్తుతం కాంగ్రెస్‌కు మ్యాజిక్ ఫిగర్ లేకపోయినా.. అవిశ్వాసంతో చివరకు తమదే విజయమంటూ ధీమా వ్యక్తం చేస్తోంది. అన్ని పార్టీలలో ధీమానే కనిపిస్తున్నా.. చివరకు విజయం ఎవరిదన్నదే హాట్‌టాపిక్‌గా మారింది. మాజీ మంత్రి జోగు రామన్న, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డిలు నువ్వా?నేనా? అంటూ మున్సిపల్ అవిశ్వాసంపై పట్టుబిగిస్తున్నారు.

ఐదుగురు కౌన్సిలర్లే కీలకం

బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యను వ్వా? నేనా? అన్నట్లుగా సీన్ మారిపోవడంతో ఐదుగురు కౌన్సిలర్లు కీలకంగా మారారు. ఎంఐఎం పార్టీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు అసమ్మతి కౌన్సిలర్ల మద్దతు ఎవరికన్నదే ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పటి వరకు ఉన్న సమాచారం మేరకు ఈ ఐదురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌కే మద్దతునిచ్చేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల నుంచి కాంగ్రెస్‌తో అంటిముట్టనట్లుగా ఉంటున్న అసమ్మతి కౌన్సిలర్లు కూడా సొంత పార్టీ నిర్ణయానికే కట్టుబడి ఉండే అవకాశం కనిపిస్తుంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి చెందిన మొత్తం 11 మంది కౌన్సిలర్లు క్యాంపుబాట పట్టారు. ముగ్గురు ఎంఐఎం కౌన్సిలర్ల మద్దతును కలుపుకుంటే కాంగ్రెస్ బలం 14కు చేరనుంది. అలాగే ఇద్దరు కాంగ్రెస్ అసమ్మతి కౌన్సిలర్ల మద్దతును కూడగడితే సభ్యుల సంఖ్య 16కు చేరుతుంది. మరో ఒకరిద్దరు బీజేపీ, బీఆర్ఎస్ నుంచి మద్దతునిచ్చేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఈ లెక్కలతోనే కాంగ్రెస్ అవిశ్వాసంపై ధీమాతో కనిపిస్తుంది. కానీ ఏ కొంచెం అటు ఇటు అయిన అవిశ్వాసం నెగ్గే అవకాశం ఉంటుంది. బీజేపీ, బీఆర్ఎస్ సభ్యుల సంఖ్యను కలుపుకుని ప్రస్తుతం 33 మంది కౌన్సిలర్ల మద్దతు ఉంది. ఎమ్మెల్యే సభ్యత్వంతో కూటమి బలం 34కు చేరనుంది. దీంతో ప్రతిపక్షాలు అవిశ్వాసాన్ని నెగ్గే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

కాంగ్రెస్ వైపు చూస్తున్నదెవరు?

మున్సిపల్ వైస్ చైర్మన్ అవిశ్వాసం వీగిపోవాలంటే కాంగ్రెస్ పార్టీకి ఒకరు, ఇద్దద్దరు కౌన్సిలర్ల మద్దతు తప్పనిసరిగా మారింది. దీంతో కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లపై గురిపెట్టింది. ఇప్పటికే బీజేపీకి చెందిన ఓ కౌన్సిలర్‌ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడంతో పెద్ద గందరగోళమే జరిగింది. అయితే గురువారం రోజున జరిగే మున్సిపల్ అవిశ్వాస బలపరీక్షలో ఒకరిద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీకి మద్దతునిచ్చేందుకు సిద్ధమయ్యారన్న టాక్ వినిపిస్తోంది. దీంతో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలలో కౌన్సిలర్ల మద్దతుపై అనుమానాలు వస్తున్నాయి. అంతేకాకుండా చివరి సమయంలో సమావేశానికి హాజరై అనుకూలంగా చేతులెత్తుతారా? లేదా? అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా సమావేశానికి హాజరైనా.. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చేతులెత్తకపోతే పరిస్థితి ఏమిటని ప్రతిపక్షాలు తర్జనభర్జన పడుతున్నాయి. విప్ జారీ చేసేందుకు బీఆర్ఎస్ సిద్ధమైన దానితో పెద్దగా ప్రయోజనం ఉండదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మెజార్టీ ఉన్న అవిశ్వాసంపై గట్టిగా చెప్పుకోలేని పరిస్థితి కనిపిస్తోంది. అయితే బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన ఒకరిద్దరు కౌన్సిలర్ల మద్దతుతో అవిశ్వాసాన్ని ఎలాగైనా గట్టెక్కేందుకు అధికార పార్టీ అన్నిరకాల ప్రయత్నాలు మొదలు పెట్టింది. అవిశ్వాసానికి ఇక సమయం లేకపోవడంతో కౌన్సిలర్లకు అడిగినంతా ఇచ్చేందుకు అన్ని పార్టీలు సిద్ధమవుతున్నాయి.



మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాసం నిర్వహించే సమావేశ మందిరం

క్లస్టర్ల వారీగా రుణమాఫీ సమావేశాలు

- నేడు రైతులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

ఉట్నూర్, జూలై 17: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రూ.లక్ష లోపు రైతుల పంట రుణాల మాఫీని మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు క్లస్టర్ల వారీగా గురువారం సమావేశాలు నిర్వహించనున్నారు. మండలంలోని దంతన్‌పల్లి, హస్నాపూర్, నర్సాపూర్(బి), పులిమడుగు, సాలెవాడ(బి), షాంపూర్, ఉమ్రి, ఉట్నూర్ క్లస్టర్ల పరిధిలోని 1,545 మంది రైతులకు చెందిన పంట రుణాలు మాఫీ చేస్తూ జాబితా విడుదలైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి షాంపూర్ క్లస్టర్‌లో ఉన్న రైతు వేదికలో ఏర్పాటు చేస్తున్న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడనున్నారు. రైతు రుణమాఫీ విడుదల కావడంతో షాంపూర్‌లో సీఎం వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా అధికారులు, నాయకులు, రైతులతో కలిసి సంబరాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంతో మండల వ్యవసాయ అధికారులు ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు

- బోథ్ మండలంలో 79.8 మి.మీ.ల అత్యధిక వర్షపాతం

ఆదిలాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా జిల్లాలో ఓ మోస్తరు స్థాయి వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం జిల్లా సగటు వర్షపాతం 6.2 మి.మీ. కాగా.. 16.6 మి.మీ.ల వర్షపాతం కురిసింది. జూన్ 1 నుంచి జూలై 17 వరకు జిల్లా సగటు వర్షపాతం 359.9 మి.మీ.లు కాగా 408.3 మి.మీ. అధిక వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బోథ్ మండలంలో 79.8 మి.మీ.ల భారీ వర్షం కురవగా.. ఆదిలాబాద్ అర్బన్‌లో 55.0 మి.మీ.లు, ఇంద్రవెల్లిలో 29.3, జైనథ్‌లో 25.3, మావలలో 18.0, ఇచ్చోడలో 17.0 మి.మీ.ల వర్షపాతం కురిసింది. అత్యల్పంగా తాంసి మండలంలో 1.0 మి.మీ.ల వర్షపాతం కురిసింది. జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి స్వల్పంగా వరదనీరు వచ్చి చేరుతోంది. సాత్నాల ప్రాజెక్టు నీటిమట్టం 281.90 మీటర్లకు చేరుకోగా.. మత్తడివాగు ప్రాజెక్టు నీటిమట్టం 275.600 మీటర్ల వద్ద కనిపిస్తోంది. మరో రెండు, మూడు రోజుల పాటు జిల్లాకు భారీ నుంచి అతి భారీ వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. అయితే, ఇప్పటి వరకు చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి ఆశించిన స్థాయిలో వరదనీరు చేరకపోవడంతో ఆయకట్టు రైతుల్లో ఊగిసలాట కనిపిస్తోంది.

- కాలనీల్లో సీసీ రోడ్లపై నిలిచిన వర్షపు నీరు

గుడిహత్నూర్: మండలకేంద్రంలోని హనుమాన్‌నగర్ కాలనీలో సీసీ రోడ్డుపై ఇటీవల కురిసిన వర్షాల నీరు నిల్వ ఉండటంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలో సీసీ రోడ్డు నిర్మించినప్పటికీ మురికి కాలువలు నిర్మించక పోవడంతో వర్షపునీరుతో పాటు ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు రోడ్డుపై నిలుస్తుంది. దీంతో దోమల సమస్య ఏర్పడుతోందని, వర్షాకాలం కాబట్టి అంటూ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై వర్షపు నీరు, మురుగు నీరు నిలువకుండా చూడాలని పలువురు కాలనీవాసులు కోరుతున్నారు.



హనుమాన్‌నగర్‌లో సీసీ రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

ఘనంగా విఠల్‌రుకుంబాయి కల్యాణం

జైనథ్, జూలై 17: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో బుధవారం స్థానిక విఠలేశ్వరుని ఆలయంలో విఠల్ రుకుంబాయి కళ్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిత్య హోమం, అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విఠల్ రుకుంబాయిలకు పట్టువస్త్రాలను ధరింప చేసి వివిధ ఆభరణాలతో అలంకరించారు. అనంతరం పల్లకీలో డప్పులు, భాజాల చప్పుళ్ల మధ్య విఠల్‌రుకుంబాయి ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని ప్రధాన వీధులగుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో మహారాష్ట్రలోని విఠల్‌రుకుంబాయి దేవస్థానంలో జరిగే విధంగా తొలి ఏకదశి పర్వదినాన్ని పురస్కరించుకుని విఠల్‌రుకుంబాయి ఉత్సవ విగ్రహాలకు వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు గ్రామ ప్రజలు తమ మొక్కులను తీర్చుకొని ప్రజలు పాడిపంటలతో చల్లంగా ఉండాలని వేడుకున్నారు. అనంతరం గ్రామంలో పెదఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపూర్ గ్రామ ప్రజలు, మహిళా భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

సంక్షిప్త సమాచారం



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

సహాయ నిధి చెక్కుల పంపిణీ

బోథ్, జూలై 17: మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన లబ్ధిదారులకు మంగళవారం స్థానిక శాసనసభ్యులు జాదవ్ అనిల్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వపరంగా మంజూరైన వారికి నిధులు మంజూరు చేయడం జరగడంతో ఈ చెక్కులను పంపిణీ చేశారు.

'ఆత్మరక్షణకు కరాటే'

ఆదిలాబాద్ అర్బన్, జూలై 17: కరాటే ఆత్మరక్షణతో పాటు శరీర ఎదుగుదలకు ఉపయోగపడుతుందని జిల్లా గిరిజన క్రీడలాభివృద్ధి అధికారి పార్థసారధి అన్నారు. బుధవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లాస్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలను నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి మాట్లాడుతూ కరాటే ఆత్మరక్షణే కాకుండా శరీర ఎదుగుదల ఉంటుందన్నారు. పిల్లలు ఒక ఆటను ఎంచుకొని సాధన చేస్తూ రాణించాలని సూచించారు. క్రీడా సర్టిఫికెట్లు భవిష్యత్తుల్లో ఉద్యోగ, విద్య అవకాశాలకు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అన్నారపు విరేష్, సహా తైక్వాండో క్లబ్ అధ్యక్షుడు శివప్రసాద్, సహాయ కార్యదర్శి తెలంగ్ అజయ్‌కుమార్, కోచ్ గోంగలి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ సీఎస్సీ నిర్వహకుడికి ఢిల్లీలో పురస్కారం

ఇచ్చోడ, జూలై, 17: ఇచ్చోడ మండల కేంద్రంలో ఎస్‌బీఐ కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్సీ) నిర్వాహకుడు కొండ ప్రశాంత్ మంగళవారం ఢిల్లీలో తెలంగాణ తరపున ఉత్తమ అవార్డు అందుకున్నారు. కేంద్ర అదనపు కార్యదర్శి ఆనంద్‌రావు పాటిల్, మేనేజింగ్ డైరెక్టర్ ఆఫ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సీఎస్సీ సంజయ్ కుమార్ రాకేష్‌ల చేతల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నాడు. దేశవ్యాప్తంగా సీఎస్సీల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉత్తమ సేవ అందించిన 30 మంది సీఎస్సీల నిర్వహకులకు మాత్రమే ఈ అవార్డులను అందజేశారు. తెలంగాణ నుంచి ప్రశాంత్ ఒక్కరే ఎంపికయ్యారు. 2019 నుంచి 2024 వరకు 39,433 డిజిటల్ లిటరసీలో లావాదేవీలు పూర్తిచేయడం ద్వారా అవార్డుకు ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి ఇచ్చోడ వాసి ప్రశాంత్‌కు అవార్డు రావడంతో పలువురు ఆయనను అభినందించారు.



ఢిల్లీలో పురస్కారం అందుకుంటున్న కొండ ప్రశాంత్

బజార్‌హత్నూర్‌కు త్వరలో భట్టి విక్రమార్క

- గ్రామస్థుల సమస్యలను స్వయంగా తెలుసుకోనున్న ఉప ముఖ్యమంత్రి
- సభాస్థలిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజార్షా షా, ఎస్పీ గౌస్‌ఆలం



సభాస్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ గౌస్‌ఆలం



గ్రామస్థులతో స్థానిక సమస్యల గురించి అడిగి తెలుసుకుంటూ..

బజార్‌హత్నూర్, జూలై 3: మండల పరిధిలో గల పిప్రి గ్రామానికి త్వరలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క రానున్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ గౌస్‌ఆలం పిప్రి గ్రామంలో సభాస్థలిని పరిశీలించారు. సమావేశానికి భారీ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు ప్రజలు సమావేశానికి హాజరవుతారని వారికి సరిపడా స్థలాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అధికారులకు సూచించారు. హాజరైన వారికి ఎటువంటి అసౌకర్యాల కలుగకుండా చూసుకోవాలన్నారు. సభాస్థలి వద్ద హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ గౌస్‌ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త, సూపరింటెండెంట్ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్ జయవంత్‌రావు, డీఆర్‌డీఏ పీడీ సాయన్న, ఎస్సీ కార్పొరేషన్ అధికారి శంకర్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ దిలీప్, మండల ప్రత్యేక అధికారి జిల్లా సహకార సంఘం అధికారి మోహన్, డీపీఆర్‌వో తిరుమల, మండల తహసీల్దార్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

- గ్రామస్థుల సమస్యలు విన్న కలెక్టర్

డిప్యూటి సీఎం భట్టివిక్రమార్క రాక సందర్భంగా సభా స్థలాన్ని పరిశీలించిన అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలను గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని గ్రామస్థులతో స్పష్టం చేశారు.

- గతంలో భట్టి రాక వాయిదా

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తరువాత పిప్రి గ్రామానికి డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క రాక ఖరారైనప్పటికీ.. అప్పటికే పార్లమెంటు ఎలక్షన్‌లకు సంబంధించిన కోడ్ రావడంతో ఆయన రాక తాత్కాలికంగా వాయిదా పడింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు ఆదిలాబాద్ జిల్లాలోని బజార్‌హత్నూర్ మండల పరిధిలో గల పిప్రి గ్రామం నుంచే పాదయాత్రను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రాంభించారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే తప్పకుండా గ్రామానికి వస్తానని వాగ్దానం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి త్వరలో మండలానికి వస్తుండడంతో మండలానికి మహర్దశ రానుందని మండలవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్

ఆదిలాబాద్ అర్బన్, జూలై 17: జిల్లాలోని వ్యవసాయ, వ్యవసాయ విస్తరణ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, బ్యాంక్ అధికారులు, సహకార శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ రాజార్షిషా రైతు రుణమాఫీ 2024 అమలుపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ జిల్లాలో రూ.లక్ష లోపు పంట రుణాలు పొందిన 18,739 మంది రైతులకు సంబంధించిన పంట రుణాలు మాఫీ చేయడం జరుగుతుందని ఆయన ఈ సందర్భగా తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రైతులతో కలిసి పండుగ వాతావరణంలో మాఫీ పొందిన రైతులతో రైతు వేదికలలో సంబరాలు జరుపుకోవాలన్నారు. ప్రతీ మండలానికి మండల వ్యవసాయ అధికారిణి నోడల్ అధికారిగా నియమించడం జరిగిందని, ప్రతీ క్లస్టర్‌లో రైతుల ర్యాలీలు, రైతు వేదికలను సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను ఉద్దేశించి సందేశాన్ని ఇస్తారని పేర్కొన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి, తదితరులు పాల్గొన్నారు.

వాగులు, వంకలు దాటి.. వైద్యసేవలు!

- ఇంద్రవెల్లి, సిరికొండ మండలాల్లో వైద్యసిబ్బందికి తప్పని తిప్పలు

ఇంద్రవెల్లి, జూలై 17: మండలంలోని పిట్టబొంగురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వాల్గోండ సబ్ సెంటర్‌లోని వడ్‌గాం గ్రామ పంచాయితీ పరిధిలోని జెండగూడ గ్రామంలో ప్రతి బుధవారం పిల్లలకు వ్యాక్సిన్ కార్యక్రమంలో భాగం గా ఆరోగ్య కార్యకర్త విజయ సుందరి, సీహెచ్‌డబ్ల్యూ అనసూయ ఆధ్వర్యంలో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్న ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కొండ ను దాటుతూ వైద్యసేవలు అందిస్తున్నారు. వారిని గ్రామస్థులు అభినందించారు.





జెండగూడకు వాగు, కొండలను దాటి వెళ్తున్న వైద్య సిబ్బంది

సిరికొండ: మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వైద్య సిబ్బంది కాలినడకన వెళ్తూ.. వాగులు, వంకలు దాటి వైద్యం అందిస్తున్నారు. బుధవారం సిరికొండ మండలంలోని తుమ్మల్‌పాడ్ గ్రామంలో కొండాపూర్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రానికి చెందిన ఏఎన్‌ఎంలు సుశీల, తూర్పుబాయి, ఆశా కార్యకర్తలు చేరుకుని గిరిజనులకు వైద్యం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకల్లో వరద రావడంతో జనం బయటకు రాలేక పోతున్నారు. దీంతో కొండాపూర్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం వైద్య సిబ్బంది మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లి పలువురు గర్భిణులు, బాలింతలకు వైద్యం అందించారు. ఇందులో సుశీల, తూర్పుబాయి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.



- తుమ్మల్‌పాడ్ వాగును దాటుతున్న వైద్యసిబ్బంది



- గ్రామస్థులకు వైద్య సేవలను అందిస్తున్న సిబ్బంది

మహిళా కమిషన్‌ను కలిసిన రాష్ట్ర కో-ఆర్డినేటర్

భోథ్, జూలై 17 : తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నూతనంగా నియమితులైన నేరేళ్ళ శారదను బుధవారం ఏఐసీసీ విచార విభాగ్ తెలంగాణ రాష్ట్ర కో-ఆర్డినేటర్ తుల అరుణ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన ఛైర్మన్‌ను సన్మానించారు. ఆయన వెంట తెలంగాణ రాష్ట్ర పీసీసీ ఎన్నారై విభాగం కన్వీనర్ మంద భీమిరెడ్డి ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం



గిమ్మాలో మహారాష్ట్ర మద్యాన్ని పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

జైనథ్, జూలై 17 : జైనథ్ మండల సరిహద్దున గల పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న గిమ్మా గ్రామానికి చెందిన మాదస్తు సాయి(28)ని బుధవారం మధ్యాహ్నం ఆదిలాబాద్ జిల్లా ఎక్సైజ్ సీఐ విజందర్ పట్టుకున్నారు. సీఐ విజందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన ఎంసీ మెక్‌డోవెల్ ఆరు సీసాలను గిమ్మా గ్రామంలో నిల్వ ఉంచి జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్‌కు తరలిస్తుండగా నిందితుడు సాయిని పట్టుకున్నామన్నారు. సుమారు తొమ్మిది వేల విలువ గల సీసాలను స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ విజందర్ తెలిపారు. సీఐ వెంట ఆదిలాబాద్ ఎక్సైజ్ ఎస్సై వైద్య వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ నానకసింగ్‌లతో పాటు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.


అందర్‌బంద్‌లో షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అనిల్‌జాదవ్

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

● సవారీ షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే

భీంపూర్, జూలై 17: మత సామరస్యానికి మొహర్రం పండుగ అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం ఆయన డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డితో కలిసి భీంపూర్ మండలంలోని అందర్‌బంద్‌లో సవారీ బంగ్లా వద్ద షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం 24 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనిల్ జాదవ్ మాట్లాడుతూ కల్యాణలక్ష్మీ చెక్కులతో పాటు ఇస్తానన్న తులం బంగారం హామీ ఎప్పుడు నెరవేరుస్తారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. డీసీసీబీ బోజారెడ్డి మాట్లాడుతూ ఏక కాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని రైతుల కు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా ఆశ్రమ పాఠశాలలో మొక్కలను నాటారు. ఇందులో మాజీ ఎంపీపీ కుడిమేత రత్న ప్రభ సంతోష్, తాజా మాజీ జడ్పీటీసీ కుంరా సుధాకర్, మండల కన్వీనర్ మేకల నాగయ్య, డీసీసీబీ డైరెక్టర్ బక్కి గోవర్ధన్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సాయిలింగిలో సవారీ షెడ్ ప్రారంభం

తలమడుగు, జూలై 17: కనుమరుగువుతున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని సాయిలింగి గ్రామంలో నూతనంగా నిర్మించిన సవారీ షెడ్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొహర్రం పండుగ సందర్భంగా ఊరంతా చల్లని వాతావరణం నెలకొందన్నారు. అనంతరం హసన్ హుస్సేన్‌పీరీలను దర్శించుకున్నారు. అనంతరం గిరిగాం గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్‌కుమార్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, యువ నాయకులు పిడుగు అభిరాంరెడ్డి, మాజీ సర్పంచ్ జంగాల పొచ్చన్న, దేవర పొచ్చెన్న, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాగా, తలమడుగు మండలంలోని సాయిలింగి గ్రామ పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో సుంకిడి గ్రామంలో గల శివసాయి హోటల్‌లో సాధారణ వ్యక్తిలా కాసేపు నాయకులతో, గ్రామస్థులతో గడిపిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను గ్రామస్థులు చూసి అభినందించారు. పదవిలో ఉన్న మాతో కలిసి సాధారణ వ్యక్తిలా గడపడం నిజంగా గొప్ప విషయమని కొనియాడారు.

'సేవలను గుర్తించడం హర్షనీయం'

ఆదిలాబాద్ అర్బన్, జూలై 17: రాష్ట్ర ప్రభుత్వం ఆర్ఎంపీ సేవలను గుర్తించి హర్షనీయమని, ఆదిలాబాద్ ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భీముడు, నర్సింహులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా కలెక్టర్లతో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆర్ఎంపీలు, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్స్ అందజేస్తామని సూచించడం శుభపరిణామం అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ప్రదానం చేశారన్నారు. తమను గుర్తించినందుకు డిప్యూటీ సీఎం, మంత్రులకు ఆదిలాబాద్ ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధన్యవాదాలు తెలిపారు. ఇందులో డా.చంద్రకాంత్, డా.జైకిస్తు, డా.రాజన్న, డా.బిస్వాస్, నారాయణ, డా.దేవిదాస్, డా.సాదిక్‌బాబా, డా.పరశురాం, డా.సోమన్న, డా.కుమార్‌గౌరవ్, డా.విజయ్, డా.అనిల్, డా.హర్షవర్ధన్, డా.విజయ్, తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

● ఆదిలాబాద్ జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు ● వేకువజాము నుంచే పలు ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

ఆదిలాబాద్ అర్బన్, జూలై 17: ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి వేడుకలను పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. వైష్ణవ ఆలయాల్లో భక్తులు తెల్లవారు జాము నుంచే పూజాది కార్యక్రమాలను చేపట్టారు. దక్షిణాయాన కాలంలో వచ్చే తొలి పండుగ ముక్కోటి ఏకాదశి. సాక్షాత్తు విష్ణుమూర్తి దేహం నుంచి వెలువడిన సత్యరూప సాక్షిగా ఇతిహాసాలు అభివర్ణిస్తున్నాయి. ఆషాఢ మాసంలో వచ్చే ఏకాదశిని ప్రత్యేకంగా భావిస్తారు. కాగా పట్టణంలోని మార్వాడి ధర్మశాలలో ఉన్న శ్రీబాలాజి వేంకటేశ్వర ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాలల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయ పూజారి దైవదర్శనానికి వచ్చిన భక్తులకు ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలతో పాటు ఆశీర్వచనాలను


ఇచ్చోడ మండలం ముక్రా(బి) గ్రామంలో ఊరేగింపు

అందచేశారు. కాగా తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రాంనగర్‌లో గల శ్రీవిఠల రుక్మబాయి ఆలయంలో ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. ఈ మేరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉట్నూర్: హిందువులకు నూతన పండుగ అయిన ఏకాదశి పండుగ సందర్భంగా ఏజెన్సీలోని ప్రాంతాల గ్రామాలలో ప్రజలందరు తొలి ఏకాదశి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయమే నిద్రలేచి స్నానాదులు పూర్తి చేసుకుని ఇళ్లలో ఉన్న దేవతామూర్తులకు మహా విష్ణువుకు ఘనంగా పూజలు నిర్వహించి సమీపంలో ఉన్న ఆలయాలకు వెళ్లిభక్తులు పూజలు నిర్వహించుకున్నారు. ఉట్నూర్ పట్టణంలోని అయ్యప్ప క్షేత్రంతో పాటు, హనుమాన్ మందిరం, సాయిబాబా ఆలయం, రామాలయం, శివాలయం, నాగశేషుడి ఆలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు.

ఇచ్చోడ: మండలవ్యాప్తంగా బుధవారం తొలి ఏకాదశి వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వైష్ణవ ఆలయాల్లో భక్తులు తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజ కార్యక్రమాలను చేపట్టారు. ఆశాడ మాసంలో వచ్చే ఈ ఏకాదశిని ప్రత్యేకంగా భావిస్తారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. తొలి ఏకాదశి ఉపవాస దీక్షను చేపట్టి గ్రామాల్లో గల ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

గుడిహత్నూర్: మండలకేంద్రంతో పాటు గ్రామాల్లో బుధవారం వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాలయంలో తెల్లవారు జామున నుంచి భక్తులు ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో ఉన్న శివలింగం నంది విగ్రహం, విఠల్ రుక్మిణి బాయి విగ్రహాలకు పూజలు చేశారు. .

నేరడిగొండ: తొలి ఏకాదశి సందర్భంగా మండలకేంద్రంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంతో పాటు శివాలయాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి ఉన్నారు.


రాంనగర్‌లో విఠలరుక్మబాయి ప్రతిమలకు పూజలు చేస్తున్న పూజారి

భోథ్: మండలంలోని తొలి ఏకాదశిని పురస్కరించుకుని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సోనాలలోని గ్రామ ఆలయాలలో గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేపట్టగా కుచలాపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కౌటా(బి) గ్రామంలో శబరి మాత ఆలయంలో అమ్మవారికి పంచామృత అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు.

బజార్‌హత్నూర్: మండలంలోని ఎంపీ స్వగ్రామమైన జాతర్లలో గల శ్రీవేంకటేశ్వరుడి ఆలయంలో ఎంపీ గోడం నగేష్ తొలి ఏకాదశి సంధర్భంగ గ్రామస్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్, అల్కె గణేష్, మాతిజీ జడ్పీటీసీ కొత్త శంకర్, మాజీ ఎంపీటీసీ పెందుర్ ఈశ్వర్, నానం రమణ, భోజన్న, మహేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం పండుగ

● రుయ్యాడి పీరీలకు మలీద ముద్దలు, కిచిడి లడ్డూలను నైవేద్యంగా సమర్పించిన భక్తులు ● బెల్లం బంగారంతో తులభారం ● గ్రామాలలో సవారీలతో ఊరేగింపు ● ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఘనంగా పీరీల పండుగ వేడుకలు

తలమడుగు, జూలై 17: మత సామరస్యానికి అతీతంగా జరుపుకునే మొహర్రం పండుగ ఉత్సవాలు ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం మొహరం పండుగ సందర్భంగా పీరీలకు మలీద ముద్దలు, కిచిడి లడ్డూలతో భక్తులు నైవేద్యం సమర్పించారు. మండలంలోని రుయ్యాడి పీరీలకు ఘనమైన చరిత్ర ఉండటంతో పీరీలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి కాకుండా కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కొంత


ఉట్నూర్ పట్టణంలో సవారిలా సందడి


హసన్ హుస్సేన్ పీరీలకు పూజలు నిర్వహిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ

మంది భక్తులు వారు కోరుకున్న కోరికలు తీరడంతో నగదు రూపంలో బంగారం వెండి రూపంలో బెల్లం బంగారం రూపంలో తులభారం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామని హసన్ హుస్సేన్ అలే కమిటీ అధ్యక్షులు లోక భూమారెడ్డి తెలిపారు. అదే విధంగా మండలంలోని తలమడుగు, సుంకిడి, బరంపూర్, జరి, దేవాపూర్, కజ్జర్ల, డోర్లి తదితర గ్రామాల్లో మొహరం పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. పీరీలకు రంగురంగుల వస్త్రాలు


రుయ్యాడిలో పీరీలను ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

అలంకరించి, భాజాభజంత్రీలతో ఊరేగింపు నిర్వహించుకున్నారు.

● **సర్వమత సమ్మేళనం : ఆదిలాబాద్ ఎస్పీ**

తలమడుగు: రుయ్యడి గ్రామంలో గల సుప్రసిద్ధ దైవ క్షేత్రం హసన్ హుస్సేన్‌లను జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు డప్పు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. హసన్ హుస్సేన్ దైవ దర్శనాన్ని చేసుకున్నారు. అనంతరం గ్రామస్థులతో కలిసి గ్రామం సమావేశ మందిరంలో గ్రామ చరిత్రను అడిగి తెలుసుకున్నారు.

ఉట్నూర్: ఉట్నూర్ ఏజెన్సీలో సవారిల సందడితో మొహారం వేడుకలు ఘనంగా జరిగాయి. ఒక వైపు వర్షం పడుతున్నప్పటికి ఏజెన్సీలోని గ్రామాలలో కులమతాలకు అతీతంగా మొహర్రం వేడుకలను నిర్వహించారు. ఉట్నూర్‌లోని బోయవాడ, శాంతినగర్‌లలో ఉన్న సవారీల వేదికల నుంచి ఉదయం శోభాయాత్ర నిర్వహించారు. నాగపూర్, ఎంకా, పెర్కగూడం, షాంపూర్, తదితర గ్రామాల్లోనూ ఘనంగా మొహర్రం నిర్వహించారు.

బోథ్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మొహర్రం పండుగ వేడుకల్లో భాగంగా బుధవారం పీరీలకు మలిద పేరుతో నైవేద్యాన్ని సమర్పించుకున్నారు. రెండు పండుగలు ఒక రోజు రావడంతో గ్రామాలలో హిందూ, ముస్లీంలు పండుగ వేడుకల్లో నిమగ్నమాయ్యరు.

కొనసాగుతున్న మొహర్రం ఉత్సవాలు


పీర్లను దర్శించుకుంటున్న భక్తులు

నిర్మల్ కల్చరల్, జూలై 17 : జిల్లాకేంద్రంలో ముస్లింల పవిత్ర మొహర్రం ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఐదు రోజులుగా పంజేషా గల్లీలో పెద్ద ఎత్తున పంజాలు ప్రతిష్ఠించి పెద్ద లాల్ సాహెబ్‌లకు కుల మతాలకు అతీతంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యూదులతో జరిగిన పోరాటంలో ఇస్లాం మత పరిరక్షణ వ్యాప్తికోం అసువులు బాసిన హసన్, హుస్సేన్ వారి పూర్వీకుల స్మారకార్థం ముస్లిం సోదరులు మొహర్రం వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. గురువారం ముగింపు ఉత్సవాలు నిర్వహిస్తారు. దస్వీ ఉండగా ఆ రోజు తెల్లవారు జామున పెద్ద పంజా, జున్ను మున్ను మొహమ్మద్ పీర్ల ఊరేగింపులు పురవీధుల గుండా సాగుతూ భక్తుల నైవేద్యాలు స్వీకరిస్తాయి. గురువారం రాత్రి ప్రధాన కేంద్రమైన పంజేషా గల్లీ పెద్ద పంజా, పెద్ద లాల్ సాహెబ్ పీర్ల శోభాయాత్ర కొనసాగుతూ వినాయక్ సాగర్ చెరువుకు చేరుకొని ప్రార్థనలు జరిపిన తరువాత నిమజ్జనం చేస్తారని మీర్జా రహీం బేగ్ తెలిపారు.


పీరీలను ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

భైంసా రూరల్ : మండలంలోని కోతుల్‌గాం గ్రామంలో బుధవారం పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. చిన్న పెద్ద తేడా లేకుండా కలిసికట్టుగా భక్తిశ్రద్ధలతో డప్పు బాజాలతో వీధివీధిన ఊరేగింపు నిర్వహించారు. భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. అగ్నిగుండం వద్ద వివిధ వేషధారణలో అలరించారు. రాత్రి పీరీలను ప్రతిష్ఠించి ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : మండలంలోని ఆయా గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుల, మతాలకు అతీతంగా జరిగిన వేడుకల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీరీలను గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

లక్ష్మణచాంద : మండలంలో బుధవారం నిర్వహించిన మొహర్రం ఉత్సవాలు మత సామరస్యం చాటాయి. హిందువులు, ముస్లింలతో ఇతర మతస్తులు కూడా ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. తమ ప్రాంత ప్రజల కోసం పదవులతో పాటు ప్రాణాలర్పించిన హసన్, ఉస్సేన్ అనే ముస్లిం పాలకులను స్మరిస్తూ సాగే ఈ పండుగలో కులాలు, మతాలకతీతంగా పాల్గొని పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో ఈ ఉత్సవాలు సాదాసీదాగా నిర్వహిస్తే మునిపెల్లిలో మాత్రం ఎప్పటిలాగే ఒక ప్రత్యేకతను


దిలావర్‌పూర్‌లో పీరీల ఊరేగింపు

సంతరించుకున్నాయి. గత వారం రోజులుగా మసీదులో గుగ్గిలం - షైసాచ్చి గుమగుమల మధ్య ప్రత్యేక పూజలు చేయటంతో పాటు రాత్రులందు నిర్వహించిన అస్సైదులా నృత్యాలు పలువురిని అలరించాయి. చివరి రోజైన బుధవారం పవిత్ర 'దక్షిణ గంగగా పిలువబడే గోదావరి నుండి గంగాజలం తీసుకొచ్చి మసీదులోను, అగ్నిగుండం చుట్టూ అభిషేకం చేశారు. విచిత్ర వేషధారణ వేసిన పలువురు వ్యక్తులతో పాటు యువకులు అగ్నిగుండం చుట్టూ చేసిన అస్సైదులా నృత్యాలు, పాడిన పాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులు అగ్నిగుండంలోని నిప్పుల మీద నుండి దాటుతూ తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఎన్నో ఏళ్లుగా అనుసరిస్తున్నటువంటి సంతాన ప్రాప్తి కోసం మహిళలు పీరీలకు నాడలు వేయటం అనే విశ్వాసమైన కార్యక్రమం బుధవారం కూడా కొనసాగింది. ఈ ఉత్సవానికి, గ్రామంలో నిర్వహించిన జాతరకు వందలాది మంది హాజరయ్యారు.

సారంగాపూర్ : మండలంలోని తాండ్రలో బుధవారం ఘనంగా మొహర్రంను మొహర్రం పండుగ నిర్వాహకులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో పీరీలను డప్పు మేళాల మధ్య గ్రామంలోని వీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులందరూ పీరీలను తిలకించడానికి తరలివచ్చి మొక్కులను మొక్కారు. దీంతో పండుగ సందడి నెలకొంది.

కుభీర్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని కుప్టి, ధార్‌కుభీర్ ఆయా గ్రామాల్లో బుధవారం పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పీరీలను ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. భక్తులు పూజించి మొక్కుకలు తీర్చుకున్నారు.

కుంటాల : మండలంలోని ఆయా గ్రామాలలో మొహరం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గత ఐదు రోజుల నుండి గ్రామాలలో ఏర్పాటు చేసిన పీరీలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆఖరి రోజు బుధవారం మొహరం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.


మునిపెల్లిలో ఊరేగింపు నిర్వహిస్తున్న పీరీలు


కుభీర్‌లో పీర్ల పండగ నిర్వహిస్తున్న దృశ్యం


కల్లూర్ గ్రామంలో పీరీలను ఊరేగిస్తున్న గ్రామస్థులు

'ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి'

నిర్మల్ కల్చరల్, జూలై 17 : ఆశావర్కర్లకు వేతనాల పెంపు, ఇతర హామీలు నెరవేర్చాలని కోరుతూ బుధవారం జిల్లా వైద్యాధికారి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని పేర్కొన్నారు. నేడు ఎమ్మెల్యేకు, 22న కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. 30న ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ఆశావర్కర్ల జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, ప్రధాన కార్యదర్శి గంగామణి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఆందోళన


కుంటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో
వినతి పత్రం ఇస్తున్న ఆశా కార్యకర్తలు

కుంటాల, జూలై, 17: తమ యొక్క అపరిష్కృతంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశా కార్యకర్తలు ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గతంలో తాము 15 రోజులు సమ్మె చేపట్టిన సందర్భంగా ప్రభుత్వం సమస్యల పరిష్కారంతో పాటు వేతనాలు చెల్లిస్తామని చెప్పి ఇప్పటి వరకు పరిష్కరించకపోవడంతో ఈనెల 18న నియోజకవర్గ ఎమ్మెల్యేలకు వినతి పత్రం ఇవ్వడం, 22 న జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసి 30 న ఛలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఇందుకు సంబంధించి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశాలు చంద్రకళ, గంగామణి, సంతోషితో పాటు పలువురు ఉన్నారు.

జాతీయ పురస్కారానికి
ఉపాధ్యాయులు దరఖాస్తు చేయండి

నిర్మల్ కల్చరల్, జూలై 17 : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి జిల్లా ఉపాధ్యాయులు ఈ నెల 21లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు కాపీలు రెండు డీఈవో కార్యాలయంలో 22న సమర్పించాలని సూచించారు.

మొదటి విడతలో
1214 మంది మండల రైతులకు రుణమాఫీ

దిలావర్‌పూర్, జూలై 17 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రూ. రెండు లక్షల రుణమాఫీలో భాగంగా మొదటి విడతలో రూ. లక్ష లోపు రుణాలున్న 1214 మంది రైతులకు లబ్ధి చేకూరింది. ఈ మేరకు లబ్ధి పొందనున్న రైతుల లిస్ట్ విడుదలైంది. దీంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. మలివిడతలో రూ. లక్ష యాభై వేల వరకు, మూడో విడతలో రూ. రెండు లక్షల వరకు రుణమాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో మండల రైతులు సంబరాలు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

నేడు బన్నపల్లిలో రైతుల సంబురాలు

ప్రభుత్వం రైతులకు రుణమాఫీకి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో గురువారం బన్సపల్లిలో సంబరాలు చేసుకుంటున్నట్లు మండల వ్యవసాయ అధికారి స్రవంతి తెలిపారు. స్థానిక రైతు వేదికలో జరిగే ఈ సంబరాలలో రెండు వందల మంది రైతులు పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. రైతులతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడనున్నట్లు ఆమె తెలిపారు.

రూ.2 లక్షల రుణమాఫీకి కట్టుబడి ఉండాలి

● ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

బెజ్జూరు, జూలై 17: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉండాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. బుధవారం మండలంలోని ఇందుర్‌గాం, కుశ్నపల్లి, సోమిని, మొగవెల్లి, ఇప్పలగూడ, పాపన్నపేట గ్రామాలను సందర్శించిన అనంతరం బెజ్జూరు మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీకి ప్రభుత్వం సవాలక్ష కొర్రీలు పెట్టి ఇబ్బందులు పెడు తోందని ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటించినట్లుగా రెండు లక్షల రుణమాఫీకి కట్టుబడి ఉండాలని లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. అనంతరం సోమని, కుశ్నపల్లి ఒర్రెలను పరిశీలించారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని మండలకేంద్రంలోని రంగనాయక ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్‌గౌడ్, శంకర్, భాస్కర్‌రాజు, శ్రావన్, తిరుపతి, వసీఖాన్, శంకర్, తిరుపతి, రాజారాం, శ్యాంసుందర్, రాకేష్, సంతోష్, శ్రీనివాస్, శ్రీనివాస్, లక్ష్మణ్, సంతోష్, నీలేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన బెజ్జూరు-ఎల్కపల్లి బీటీ రోడ్డు

బెజ్జూరు, జూలై 17: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఎల్కపల్లి గ్రామానికి సరైన రోడ్డు సదుపాయం లేక దశాబ్దాలుగా ప్రజలు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రతియేటా వర్షాకాలంలో బురదమయమైన రోడ్డుపై అనేక కష్టాలు పడేవారు. ఎట్టకేలకు ఎల్కపల్లికి బీటీ రోడ్డు నిర్మాణం పూర్తైంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రత్యేక దృష్టి సారించి రూ.1.40 కోట్ల ఐటీడీఏ నిధులు మంజూరు చేయగా గతఅక్టోబర్‌లో రోడ్డుపనులు ప్రారంభించారు. గత సోమవారం అధికా రులు బెజ్జూరు నుంచి ఎల్కపల్లి వరకు బీటీ రోడ్డు పూర్తి చేయించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బెజ్జూరు నుంచి ఎల్కపల్లి గ్రామం కేవలం కిలో మీటర్ దూరం మాత్రమే ఉన్నా రోడ్డు సౌకర్యం లేదు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు ప్రజా ప్రతినిధులు, అధికారుల వద్ద మొరపెట్టుకున్నప్పటికీ ఏ ఒక్కరూ స్పందించలేదు. చివరికి తమ గ్రామానికి బీటీ రోడ్డు మంజూరవుతుందా లేదా అన్న అనుమానాలు సైతం గ్రామస్తులు వ్యక్తం చేశారు. అప్పటి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించగా నిర్మాణం పూర్తయింది.

గుట్కాప్యాకెట్లు పట్టివేత

వాంకిడి, జూలై 17: మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్ పట్టణానికి అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గుట్కా ను పట్టుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వాంకిడికి చెందిన షహీద్ మంగళవారం రాత్రి మహారాష్ట్రనుంచి వాంకిడివైపు తన ఆటో(టీఎస్ 20టి 4513)లో వస్తుండగా అనుమానం రావడంతో తనిఖీ చేశామన్నారు. ఆటోలో 30గుట్కాప్యాకెట్ల బ్యాగులు ఉన్నాయన్నారు. పట్టుబడ్డ వాటివిలువ దాదాపు రూ.11,22,000ఉంటుందని చెప్పారు. గుట్కా ను స్వాధీనపర్చుకుని నిందితుడిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఈదాడుల్లో ఏఎస్సై పోశెట్టి, హెడ్ కానిస్టేబుల్ శ్యాంరావు, కానిస్టేబుల్ దుర్గాప్రసాద్ ఉన్నట్లు తెలిపారు.

నాటుసారా, రెండు బైక్‌లు స్వాధీనం

రెబ్బెన, జూలై 17: మండలంలోని కైరిగూడ గ్రామంనుంచి వివిధగ్రామాలకు నాటుసారా రవాణా చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి రెండు బైక్‌లను జప్తు చేసినట్టు ఎక్సైజ్ ఎస్సై దీపక్ తెలిపారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.3 / కనిష్ఠం 24.5






రుణ మాఫీ సంబురం

- నేడు రైతు రుణ ఖాతాలోకి మాఫీ సొమ్ము జమ
- మొదటి విడతగా రూ. లక్ష వరకు రుణమాఫీ
- జిల్లాలో 1.20 లక్షల రైతులు
- నేడు 30 వేల 106 మంది రైతులకు లబ్ధి

ముథోల్, జూలై 17 : రైతు రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి కీలకనిర్ణయంతో జిల్లా రైతాంగం సంబుర పడిపోతోంది. మొత్తం మూడు దఫాల్లో రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించడంతో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రైతులు ఆనందడోలికల్లో మునిగిపోయారు. రైతు రుణమాఫీ పథకంలో భాగంగా గురువారం సాయంత్రం కల్లా రైతుల రుణ ఖాతాల్లో రూ.లక్ష వరకు డబ్బులు జమ కానున్నాయని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని ఏర్పాట్లు చేశారు. రుణమాఫీ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమని రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రైతు రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. మొత్తం మూడు దఫాల్లో రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు. రూ.లక్ష లోపు రుణాలను నేడు సాయంత్రానికి మాఫీ చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం 4 గంటల్లోగా రైతుల ఖాతాల్లో రూ. లక్ష నగదు జమ చేయనున్నారు. ఇక నెలాఖరు నాటికి రూ. లక్షన్నర వరకు రుణమాఫీ చేస్తామన్నారు. ఆగస్టు మొదటి వారంలో రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామన్న మాట విదితమే. రైతు రుణమాఫీ హామీ రాహుల్ గాంధీ ఇచ్చారని, రాహుల్ మాట ఇస్తే అమలు చేసి తీరుతారన్న నమ్మకం కలిగించడం మా పార్టీ బాధ్యత అని కాంగ్రెస్ నాయకులు చెప్పిన మాట నిలబెట్టుకున్నారని పలువురు రైతులు పేర్కొంటున్నారు. జిల్లాలో సుమారు లక్ష 29 వేల వరకు రైతులున్నారు. అయితే మొదటి విడతలో జిల్లాలో 30 వేల 106 మంది రైతులకు లబ్ధి జరుగనుందని సంబంధిత జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగానే గురువారం జిల్లాలోని రైతువేదికల్లో సంబరాలు జరుపుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రుణమాఫీ లాంఛనంగా ప్రారంభం చేయనున్నారు. అయితే ఈ కార్యక్రమం వీక్షించేందుకు రైతువేదికల్లో రైతులకు తగు ఏర్పాట్లను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. రైతులు రైతు వేదికలో సంబరాలు జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడంతో రైతులు ఆనందం వ్యక్తపరుస్తున్నారు.





దుక్కిదున్నుతున్న రైతులు

ప్రభుత్వానికి ధన్యవాదాలు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులను దృష్టిలో పెట్టుకొని రుణమాఫీ చేయడం మాకు సంతోషంగా ఉంది. నాకు మొదటి విడతలోనే రూ. 95 వేలు రుణమాఫీ రావడం సంతోషంగా ఉంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

\- బైరోల్ల ముత్తన్న, రైతు

రైతు ప్రభుత్వం.. కాంగ్రెస్ ప్రభుత్వం



రైతుల కష్టసుఖాలు తెలిసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు. రైతులను ఆదుకునాలన్న సంకల్పంతో ఇచ్చిన మాటను నిలబెట్టుకొని ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేయడం సంతోషించదగ్గ విషయం. కాంగ్రెస్ ప్రభుత్వం విడతల వారీగా రుణమాఫీ చేయడానికి ముందుకు వచ్చి రైతన్నలకు అండా ఉంటున్నందుకు ఎప్పటికీ మర్చిపోము. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

\- పెండెల లక్ష్మణ్, రైతు

హరిహర క్షేత్రంలో తొలి ఏకాదశి వేడుకలు



విష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్న మహిళలు

నిర్మల్ కల్చరల్, జూలై 17 : జిల్లా కేంద్రం మల్లన్న గుట్ట హరిహర క్షేత్రంలో బుధవారం హిందువుల విశిష్ట తొలి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. రామసత్యనారాయణ స్వామివారికి 108 కలశాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు ఉపవాసదీక్ష తీసుకున్నారు. ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ మురళీధర్‌రెడ్డి పాల్గొనగా భక్తులు విశేషసంఖ్యలో హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉపవాస దీక్ష విరమించే భక్తులకు గురువారం ఆలయంలో భజన ఏర్పాట్లు చేస్తున్నట్లు ధర్మకర్తలు తెలిపారు. ఆలయ గురుస్వామి మూర్తి, కోశాధికారి సామల వేణుగోపాల రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



భైంసాలో విఠల్ రుక్మాయి వేషధారణతో శోభాయాత్ర

భైంసా : పట్టణవాసులు బుధవారం తొలి ఏకాదశి వేడుకలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పద్మావతి కాలనీ పరిధిలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశిని పురస్కరించుకొని నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. స్థానిక పురాణ బజార్ ప్రాంతానికి చెందిన రాదే రాధే ప్రభాత్ బేరి బృందం విఠల్ రుక్మాయి వేషాధారణతోనున్న చిన్నారులతో పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా శోభయాత్ర నిర్వహించారు. అనంతరం గోశాలకు వెళ్లి గోమాతలకు పూజలు జరిపారు.



కుభీర్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని పల్సి, పార్డి(బి), మాగాం, పార్డి(కే), సొనారి తదితర గ్రామాల్లో బుధవారం తొలి ఏకదశి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో వేకువజామున విఠలరుక్మిణి దేవతామూర్తులకు పంచామృత అభిషేకం, పట్టువస్త్రాలతో అలంకరణ చేసి ప్రమోద్‌మహారాజ్ పూజలు చేశారు. అనంతరం మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



కుంటాల : కుంటాల మండలంలోని అన్ని గ్రామాలలో బుధవారం ఏకాదశి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఓలా విఠలేశ్వర ఆలయంలో గ్రామస్థులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా ప్రత్యేక ఉపవాస దీక్షలు చేపట్టారు. చేపట్టిన ఉపవాస దీక్షలు రేపటి వరకు కొనసాగుతాయి. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభంలో మొదటి పండుగ ఈ ఏకాదశి జరుపు కోవడం గమనార్హం.

పంట పొలంలో బయటపడ్డ శివలింగం, నంది విగ్రహాలు



శివలింగం, నంది విగ్రహాలు

దస్తురాబాద్, జూలై 17 : మండలంలోని రేవోజీపేట్ గ్రామంలోని ఓ రైతు పంటపొలంలో బుధవారం శివలింగం, నంది విగ్రహాలు బయట పడ్డాయి. గ్రామస్థులు పంట పొలాల్లో నుంచి విగ్రహాలను బయటకు తీసి ఒగ్గు కళాకారులచే ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఏకాదశి రోజు శివలింగం బయటపడడం చూసి గొప్ప విశేషంగా భక్తులు భావిస్తున్నారు. వాటిని చూసేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు తరలివస్తున్నారు.

గ్రామీణ్ సపోర్ట్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

- ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగమణి



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, జూలై 17 : గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం కొండాపూర్‌లో గల బాలసదన్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ నాగమణి చేతుల మీదుగా పిల్లలకు దుస్తులు, ఆట వస్తువులు, స్కూల్ బ్యాగ్స్, వాటర్ బాటిల్స్, బెడ్స్ పంపిణీ చేయడం జరిగింది. జిల్లావ్యాప్తంగా గంజాయిపై అవగాహన కొరకు వాల్ పెయింటింగ్స్, విద్యార్థులకు, యువకులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం హర్షనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజర్ ఏ. శ్రీనివాస్, జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యుడు పోతుగంటి నరేష్ కుమార్, డీసీపీవో దేవి మురళి, సంస్థ సిబ్బంది శ్రీకాంత్, కిషోర్, కొంతం గణేష్, బాల సదన్ సిబ్బంది కవిత, తదితరులు పాల్గొన్నారు.

'ఆర్ఎంపీ, పీఎంపీల

సేవలను గుర్తించడం శుభ పరిణామం'

భైంసా, జూలై 17 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్ఎంపీ, పీఎంపీ సేవలను గుర్తించడం శుభ పరిణామమని ఆర్ఎంపీ భైంసా డివిజన్ అధ్యక్షులు ఆశమోల్ల మోహన్, ప్రధాన కార్యదర్శి సాగర్‌లు పేర్కొన్నారు. బుధవారం భైంసాలో జరిగిన యూనియన్ సమావేశంలో మాట్లాడారు. మంగళవారం హైదరాబాద్‌లో జిల్లా కలెక్టర్లతో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణను అందించి సర్టిఫికెట్స్ అందచేసే విషయాన్ని పరిశీలించాలని సూచించడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ సేవలను గుర్తించడం హర్షించతగ్గ విషయమన్నారు.శిక్షణ ప్రక్రియను త్వరితగతిన చేపట్టి ఆర్ఎంపీ,పీఎంపీలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో యూనియన్ భైంసా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కదం అర్జున్ పాటిల్, ఎ.విజయ్‌లతో పాటు డివిజన్ పరిధిలోని యూనియన్ శ్రేణులు పాల్గొన్నాయి.

గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికుల

బకాయిలను విడుదల చేయడం హర్షనీయం

ఖానాపూర్, జూలై 17 : గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికుల బకాయిలను ప్రభుత్వం విడుదల చేయడం హర్షణీయమని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్ అన్నారు. బుధవారం ఖానాపూర్‌లోని విశ్రాంతి భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కార్మికులకు ప్రతి నెల నెల వేతనాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామ పంచాయతీ కార్మికులందరినీ యుద్ధ ప్రాతిపదికన క్రమబద్ధీకరించాలని, పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అతి తక్కువ వేతనంతో పని చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను విశాల దృక్పథంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం లింగన్న, డివిజన్ నాయకులు మాలావత్ జేవింద్, మద్దినేని చిన్న రాజన్న, ముంజం దేవేందర్, తదితరులున్నారు.

భారీ వర్షంతో జలమయమైన పంటచేలు



భైంసా ప్రాంతంలో జలమయమైన పంటచేలు



భైంసా ప్రాంతంలో నీట మునిగిన పత్తి పైరు

భైంసా, జూలై 17 : డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం వేకువ జాము వేళలో భారీ వర్షం కురిసింది. ఎకబిగిన గంటన్నరకు పైగా కురిసిన భారీ వర్షంతో పలు ప్రాంతాల పంటచేలు జలమయమయ్యాయి. పంటల పైర్లు నీట మునిగాయి. ప్రధానంగా సోయ, పత్తి చేలలో అధిక మొత్తంలో వర్షపు నీరు నిలిచింది. వివిధ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి చిన్నపాటి చెరువులను తలపించాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులలోకి వర్షపు నీరు వచ్చి చేరుతుండగా వాగులు,వంకల్లో సైతం నీటి ప్రవాహం మొదలయ్యింది. బుధవారం డివిజన్ పరిధిలోని బాసర మండలంలో 70 మిల్లీమీర్లు, లోకేశ్వరం మండలంలో 33 మి.మీటర్లు, భైంసా మండలంలో 28.6 మి.మీటర్లు, ముథోల్ మండలంలో 24.8 మి.మీటర్లు, తానూర్ మండలంలో 9.4 మి.మీటర్లు, కుభీర్ మండలంలో 19.4 మి.మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది.

ట్రిపుల్ ఐటీని సందర్శించిన ఎమ్మెల్యే రాంరావు పటేల్



బాసర ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఎమ్మెల్యే రాంరావు పటేల్

బాసర, జూలై, 17: బాసర ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను బుధవారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ సందర్శించారు. యూనివర్సిటీకి వచ్చిన ఎమ్మెల్యేకు వైస్ చాన్స్‌లర్ వెంకటరమణ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం యూనివర్సిటీలో విద్యావిధానం, విద్యార్థుల కోర్సులు, విద్యార్థులు సాధించిన విజయాల గురించి తదితర విషయాలను ఎమ్మెల్యేకు వైస్ చాన్స్‌లర్ వివరించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపస్ అంతా తిరిగి విద్యార్థుల వసతి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు.

ఎరుక కులస్తుల అభ్యున్నతికి అంకిభావంతో కృషి

భైంసా : బాధ్యతాయుతమైన విధానాల ద్వారా ఎరుకుల కులస్తుల అభ్యున్నతికి అంకితభావంతో కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పేర్కొన్నారు. బుధవారం భైంసా పట్టణంలోని నర్సింహనగర్ కాలనీ పరిధిలో డివిజన్ ఎరుకుల కుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఎకలవ్యుని జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ఏకసంతగ్రహుడైన ఎకలవ్యుడిని అందరూ ఆదర్శంగా తీర్చుకోవాలన్నారు. ఏకలవ్యుడిని స్ఫూర్తిగా తీసుకొని విద్యను అభ్యసించాలని పిలుపునిచ్చారు. సమాజంలో సమరసత నిర్మాణానికి, సమాజ రక్షణకు చిత్తశుద్ధితో ప్రతి ఒక్కరు తమ వంతు భాగస్వామ్యాన్ని అందించాలని అకాంక్షించారు. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో ఎరుకుల కులస్తుల కోసం కమ్యూనిటీ భవనాన్ని నిర్మింపచేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని పెర్కొన్నారు. కుల సంఘ సభ్యులు తెలిపిన సమస్యలను పరిష్కరిస్తానని వెల్లడించారు. ఎకలవ్యున్ని విగ్రహ ఏర్పాటుకు అవసరమైన సహాయ,సహకారాలు అందిస్తానని వివరించారు. ఈ సందర్భంగా ఎరుకుల కుల సంఘం సభ్యులతో కలిసి ఎకలవ్యుని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెండాను ఎగురవేసారు. ఇందులో మున్సిపల్ కౌన్సిలర్ తోట విజయ్, జనసేన ప్రతినిధి సుంకెట మహేష్‌బాబు , బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులు తాకోడ్ శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు నిజాం వేణుగోపాల్, సోలంకే భీంరావ్ పాటిల్, ఎరుకుల సంఘం ప్రతినిధులు కోనేరు బాలయ్య, చెర్ల పోశెట్టి, కోనేరు శేషరావ్, చెర్ల సుభాష్, సురేష్‌భూమేష్, శ్రీనివాస్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

నిలకడగా గడ్డెన్నవాగు ప్రాజెక్టు నీటి మట్టం

- అన్ని ప్రాంతాల్లోని ప్రాజెక్టుల్లో పెరుగుదల
- ప్రతికూల పరిస్థితులతో ఇక్కడ తగ్గుదల



గడ్డెన్నవాగు ప్రాజెక్టు

భైంసా, జూలై 17 : ప్రతికూల పరిస్థితులతో గడ్డెన్నవాగు ప్రాజెక్టు నీటి మట్టం నిలకడ స్థితిలో కొనసాగుతోంది. జిల్లాలోని కడెం, స్వర్ణ ప్రాజెక్టులలోకి చెప్పుకోతగ్గ రీతిలో వరద నీరు వచ్చి చేరుతుండటంతో రెండు ప్రాజెక్టుల నీటి మట్టాలు క్రమక్రమంగా పెరుగుతూ పోతున్నాయి.. ఇందుకు భిన్న స్థితిలో గడ్డెన్నవాగు ప్రాజెక్టు పరిస్థితి నెలకొంది. ఈ నెల ఆరంభంలో ప్రాజెక్టు నీటి మట్టం 355.8 మీటర్లు, 0.704 టీఎంసీలుగానున్న నీటి నిల్వలు రెండవ వారం వచ్చే సరికి తగ్గుముఖం పట్టాయి.ప్రస్తుతం ప్రాజెక్టు నీటి మట్టం 355.7 మీటర్లు, నీటి నిల్వలు 0.676 టీఎంసీలకు తగ్గిపోయాయి. అన్ని ప్రాంతాల్లో ప్రాజెక్టుల నీటి మట్టాలు ,నిల్వలు పెరుగుతూ పోతుండగా గడ్డెన్నవాగు ప్రాజెక్టు ఇందుకు భిన్నంగా నీటి మట్టం, నిల్వలు తగ్గిపోతుండటం విశేషం. అంతటా వర్షాలు కురుస్తుండటంతో ఆయా ప్రాంతాల్లోని ప్రాజెక్టులలోని నీటి మట్టాలు, నిల్వలు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. అయితే గడ్డెన్నవాగు ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్రలో ఇప్పటి వరకు చెప్పుకోతగ్గ రీతిలో వర్షాలు కురియ లేదు.

సంక్షిప్త సమాచారం

రెండు ఆభరణాల తయారీ

దుకాణాల్లో చోరీ



చిందరవందరగా పారవేసిన కౌంటర్, సామగ్రి

భైంసా, జూలై 17 : పట్టణంలోని మహాలక్ష్మీ జ్యువెల్లరీ మార్కెట్ పరిధిలో గల స్వర్ణకారులకు సంబంధించిన రెండు అభరణాల తయారీ దుకాణాల్లో మంగళవారం రాత్రి చోరి జరిగింది. దొంగలు రెండు దుకాణాలకు సంబంధించిన షట్టర్లను తెరిచి లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ప్రక్కప్రక్కనే ఉన్న ఒక దుకాణంలో తయారు చేస్తూ ఉంచిన బంగారు అభరణాలు, మరో దుకాణంలో వెండితో పాటు అభరణాలను దొంగలు అపహరించుకపోయారు. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో రెండు షాపులకు సంబంధించిన యజమానులు దుకాణాలు తెరిచేందుకు వచ్చినపుడు చోరి జరిగిన విషయంలో వెలుగు చూసింది. బాధిత దుకాణాల యజమానులు కడార్ల సంతోష్, అకోజి రాజులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. టౌన్ సీఐ రాజారెడ్డి చోరీ జరిగిన దుకాణాలను పరిశీలించి వివరాలు సేకరించారు. రెండు దుకాణాలలో పోలీసులు ఫింగర్ ప్రింట్స్ సేకరించారు.

వాహన ప్రమాదం కేసులో ఒకరి అరెస్టు

తానూర్, జూలై, 17: హిట్ అండ్ రన్ కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఇటీవల యాక్సిడెంట్‌లో గంగారెడ్డి అనే విలేఖరి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో యాక్సిడెంట్‌కు కారణం అయిన డ్రైవర్, ట్రాక్టర్‌ను గుర్తించామన్నారు. ఎస్పీ, భైంసా ఏఎస్పీ ఆదేశాల మేరకు నూతన పరిజ్ఞానంతో గుర్తించామని, ట్రాక్టర్ ముథోల్ మండలంలోని తరోడా గ్రామానికి చెందినదని, ఇటుక లోడ్‌తో బెంబర్‌కు వెళుతుండడం అదే దిశలో వెళుతున్న విలేఖరి గంగారెడ్డిని ఢీకొని డ్రైవర్ ట్రాక్టర్‌తో సహ పారిపోయాడని, అంతేగాకుండా ఎక్కడ కూడా సరెండర్ కాకుండా, నేరం ఒప్పుకోలేదని, దీంతో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసును చేదించడంలో చాకచక్యం ప్రదర్శించిన హెడ్ కానిస్టేబుళ్లు పాండు, శివరాంలను భైంసా ఏఎస్పీ అవినాష్ ప్రశంసించారు.

ముథోల్‌లో భారీ వర్షం

ముథోల్, జూలై 17 : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని చించాల, వెంకటాపూర్, తరోడా, ఎడ్‌బిడ్, చింతకుంట, మచ్కల్, రాంటెక్ తదితర గ్రామాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మొన్నటి వరకు కొద్దిపాటి వర్షం కురవడంతో రైతులు వరినాట్లు వేయలేక భారీ వర్షం కోసం ఎదురు చూశారు. ఈ మంగళవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యువ పురస్కార గ్రహీతకు సన్మానం

నిర్మల్ కల్చరల్, జూలై 17 : జిల్లాకు చెందిన పోలీసు భీమేష్ సాహితీ యువ పురస్కారం అందుకున్న సందర్భంగా బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కవు లు ఘనంగా సన్మానించి అభినందించారు. భీమేష్ రచించిన స్వేచ్ఛకు సంకెళ్లు తొలి పుస్తకానికి పురస్కారం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.